నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్, గురువారం 25 జనవరి 2024 | VIKARABAD

ఉత్తమ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి

అవార్డుకు ఎంపికైన లక్ష్మి

కొడంగల్, జనవరి 24: మండలంలోని హస్నాబాద్ గ్రామ పంచాయతీ కార్మికురాలు లక్ష్మి ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా ఎంపికయ్యారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేయడంలో ప్రజలకు అవగాహన కల్పించడంపై రాష్ట్రం నుంచి నలుగురిని కేంద్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. అందులో హస్నాబాద్ గ్రామపంచాయతీ కార్మికురాలు లక్ష్మి కూడా ఉన్నారని సర్పంచ్ పకీరప్ప తెలిపారు. ఈ నెల 26వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోదీ ద్వారా ఈ అవార్డును అందుకోనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో హస్నాబాద్ గ్రామ పంచాయతీకి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇందుకు కృషి చేసిన లక్ష్మిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

ఈ-కేవైసీ 86శాతం

కొనసాగుతున్న రేషన్ ఈ-కేవైసీ

ఈ నెల 31 వరకు గడువు..

జిల్లాలో ఇప్పటివరకు 11,64,050 మంది లబ్ధిదారుల కేవైసీ పూర్తి

వేలిముద్రలు పడక చిన్నారులు, వృద్ధులకు ఇబ్బందులు

రంగారెడ్డి, జనవరి 24(నమస్తే తెలంగాణ): రేషన్ పంపిణీలో పారదర్శకతను తేవడంతో పాటు బోగస్ రేషన్ కార్డులను తొలగించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ-కేవైసీకి ఇంకా ఏడు రోజుల గడువు మాత్రమే ఉన్నది. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు ఈ-కేవైసీ ప్రక్రియ 86 శాతం పూర్తికాగా.. ఇంకా 14 శాతం మంది వేలి ముద్రలు వేయాల్సి ఉంది. గడువు దగ్గర పడడంతో వేలి ముద్రలు వేసేందుకు లబ్ధిదారులు పరుగులు పెడుతున్నారు. ఈ నెల 31 వరకు రేషన్ లబ్ధిదారులంతా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు. వేలి ముద్రలు వేయని వారి విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వేలి ముద్రలు వేయాల్సిందే..

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాల నుంచి రేషన్ బియ్యం, ఇతర సరుకులు తీసుకునేందుకు ఈ-కేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ దుకాణాల్లో అప్‌డేట్ చేసిన ఈపాస్ మిషన్ల ద్వారా రేషన్ కార్డులో నమోదైన వారి వేలి ముద్రలు తీసుకుని, వారి వివరాలను నమోదు చేసే ప్రక్రియ కొంతకాలంగా జిల్లాలో కొనసాగుతున్నది. గత సెప్టెంబర్‌లోనే ఈ ప్రక్రియను మొదలు పెట్టిన ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 31కి గడువును పెంచింది. వేలిముద్రలు వేయకుంటే రేషన్ కార్డులో పేరుండదు అనే ప్రచారం నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు కూడా సొంతగ్రామాలకు వచ్చి ఈ-కేవైసీ చేయించుకుంటున్నారు. దీంతో కార్డు దారులు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఆరంభంలో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించలేదు. అయితే గడువు దగ్గర పడుతుండడంతో దుకాణాల వద్ద గత కొద్దిరోజులుగా రద్దీ మరింతగా పెరిగింది. పది సంవత్సరాలలోపు చిన్నారులు, వయసు పైబడ్డ వృద్ధులు ఈపాస్ యంత్రంలో వేలి ముద్రలు పడక ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొందరు ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ నమోదు కేంద్రాలకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగానే వేలి ముద్రలు తీసుకుంటున్నామని, రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 86 శాతం పూర్తి..

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 931 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,58,438 రేషన్ కార్డులు ఉండగా..అందులో 18,23,159 మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. ఇప్పటివరకు ఈ-కేవైసీ ప్రక్రియను 11,64,050 మంది పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు 86 శాతం మంది వేలి ముద్రలు వేయగా.. ఇంకా 14 శాతం మంది వేలి ముద్రలు వేయాల్సి ఉంది. గడువు సమీపిస్తుండడంతో వంద శాతం పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ ప్రగతికి కృషి చేద్దాం

- ప్రజా సంక్షేమానికి అనుగుణంగా నివేదిక సిద్ధం చేయాలి
- సర్వసభ్య సమావేశంలో 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, జనవరి 24: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కొడంగల్‌ను వేగవంతంగా అభివృద్ధి చేసుకుందామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినందున కొడంగల్ ప్రగతికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. ప్రజా సంక్షేమన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధికి సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు సూచనలు చేశారు. నియోకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యటించి ప్రజా సంక్షేమానికి అవసరమైన అంశాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇదివరకు ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా, డబుల్ రోడ్లను మరింత స్ట్రెంథనింగ్ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్లు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకునేందుకు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాల్స్, ప్రధాన వీధుల్లో హైమాస్ట్ లైట్లు తదితర ప్రగతి పనులకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, ఉపాధి అవకాశాలకు సంబంధించి అన్ని కోణాల్లో పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా 10 సంవత్సరాలు ఉన్నందున ఈ ప్రాంతంపై సీఎంకు పూర్తి అవగాహన ఉన్నట్లు తెలిపారు. కొడంగల్‌లోని 50 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పునరుద్ధరించడం, కోస్గి పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి, విద్యుత్ తదితర ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొడంగల్ ప్రాంతం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది కాబట్టి ముఖ్యమంత్రి ఈ ప్రాంతంలో ఆగ్రో ఇండస్ట్రీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరగతి అభివృద్ధికి గాను రైల్వేలైన్ ఏర్పాటు దిశగా చర్యలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుందని, అయినా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో పాండు, ఎంఈవో రాంరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొ

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బీజేపీ-కాంగ్రెస్ దోస్తానా!

అధికారం కోసం మీర్‌పేటలో ఫ్రెండ్షిప్

ఢిల్లీ పార్టీల సిల్లీ పాలిటిక్స్

మీర్‌పేట కార్పొరేషన్‌లో అవిశ్వాసం నెగ్గగానే కండువా మార్పు

- సంఖ్యాపరంగా స్పష్టమైన మెజార్టీ లేకపోయినా.. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసానికి ప్రణాళిక
- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు గాలం వేసేందుకు ప్రయత్నం
- కాసుల పండుగలా భావిస్తున్న కార్పొరేటర్లు
- బీజేపీ కౌన్సిలర్‌కు కార్పొరేషన్ మేయర్ పదవి
- పదవి రాగానే కాంగ్రెస్‌లో చేరేలా చీకటి ఒప్పందం

ఆ రెండు పేరుకే జాతీయ పార్టీలు.. ఢిల్లీ స్థాయిలో జెండాలు-ఎజెండాలు వేరంటూ రాద్ధాంతం చేస్తాయి. కానీ గల్లీకొచ్చేసరికి గలీజు రాజకీయాలకు పాల్పడుతాయి. ముఖ్యంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనలేక అసెంబ్లీ స్థాయిలోనే కాదు.. చివరకు స్థానిక సంస్థల పరిధుల్లోనూ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఇదే రుజువు కాగా.. తాజాగా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ వేదికగా ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్-బీజేపీ సిల్లీ చేష్టలు వెలుగు చూస్తున్నాయి. బీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు రెండు పార్టీలు చీకటి ఒప్పందాలకు తెర లేపాయి. ఈ మేరకు బీజేపీకి చెందిన కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు చెందిన నియోజకవర్గ స్థాయి నాయకుడి వద్దకు వెళ్లి మంతనాలు పూర్తి చేసినట్లు తెలిసింది. సంఖ్యాపరంగా స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లకు గాలం వేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సంతకాల సేకరణ దశలో ఉన్న డర్టీ పాలిటిక్స్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు సైతం భారీగానే డిమాండ్ చేస్తుండటంతో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నది. ఇక్కడ మొత్తం 46 వార్డులు ఉండగా.. ఏకంగా 25 స్థానాలను బీఆర్ఎస్ తన ఖాతాలో వేసుకున్నది. బీజేపీకి 14వార్డులు దక్కగా.. కాంగ్రెస్ ఏడు స్థానాలకు పరిమితమైంది. మేయర్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా.. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉండటంతో దుర్గ దీప్‌లాల్ చౌహాన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా బీఆర్ఎస్‌కు చెందిన తీగల విక్రంరెడ్డిని ఎన్నుకున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయం మారడంతో ఆ ప్రభావం మీర్‌పేట కార్పొరేషన్‌పైనా పడింది. కాకపోతే మేయర్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా.. కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు కార్పొరేటర్లలో ఎస్టీ మహిళ లేకపోవడంతో రెండు జాతీయ పార్టీలు చీకటి ఒప్పందానికి తెరలేపాయి. బీజేపీకి చెందిన కార్పొరేటర్ లీలా రవినాయక్‌ను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ భారీ ఎత్తున పావులు కదిపి, అందులో సఫలీకృతమైనట్లు తెలిసింది. ఈ మేరకు కాంగ్రెస్‌కు చెందిన నియోజకవర్గ స్థాయి నాయకుడి దగ్గర మంతనాలు కూడా పూర్తయినట్లు తెలిసింది. కాకపోతే బీజేపీకి చెందిన ఆమెను మేయర్‌గా చేసినట్లయితే కాంగ్రెస్ పార్టీకి ప్రయోజనం ఉండనందున.. మేయర్ పదవి రాగానే కాంగ్రెస్‌లో చేరేటట్లుగా ఒప్పందం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన భాస్కర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తున్నది.

రెండు పార్టీలు కలిసినప్పటికీ సరిపడని సంఖ్యాబలం

స్పష్టమైన మెజార్టీ లేనప్పటికీ కాంగ్రెస్ అవిశ్వాసానికి తెర లేపడంతో కార్పొరేటర్లు కాసుల పండుగలా భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్, బీజేపీకి చెందిన కార్పొరేటర్లకు రూ.ఐదు లక్షల చొప్పున ఇచ్చేలా ఒప్పందం జరిగిందనే ప్రచారం జరుగుతుంది. అయితే ముందు ఎంత ఇవ్వాలి? తదుపరి ఎంత ఇవ్వాలి? అనే దానిపైనే వీళ్ల మధ్య తర్జనభర్జనలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి నాయకుడు మేయర్ పదవి తరపున ఐదింట నాలుగో వంతు, కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్ తాను ఆశించే డిప్యూటీ మేయర్ మిగిలిన ఒక వంతు మొత్తాన్ని ఇచ్చేలా కూడా నిర్ణయం జరిగిపోయిందనే ప్రచారం కార్పొరేషన్ పరిధిలో చక్కర్లు కొడుతున్నది. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. రెండు పార్టీలు కలిసినప్పటికీ వీరి సంఖ్యాబలం 21 దగ్గరనే ఆగిపోతుంది. అందుకే సాంకేతికంగా కావాల్సిన మిగిలిన వారి కోసం రెండు పార్టీల తరపున అన్వేషణ సాగుతున్నట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత విరుద్ధమైన పార్టీతో కలవడంతో పాటు మరో పార్టీ కార్పొరేటర్లకు గాలం వేసేందుకు ప్రయత్నిస్తుండటం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

6 సబ్జెక్టులు.. 7 పేపర్లు

- భౌతిక, జీవశాస్త్రాలకు వేర్వేరుగా పరీక్షల నిర్వహణ
- ఈ ఏడాది నుంచి ఎస్సెస్సీ పరీక్షల్లో అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, జనవరి 24 : భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం రెండు వేర్వేరు సబ్జెక్టులు. వీటిని బోధించడానికి ఒక్కో సబ్జెక్టుకు ఒకరు చొప్పున వేర్వేరుగా ఉపాధ్యాయులు ఉంటారు. కానీ పరీక్షల విషయానికి వస్తే మాత్రం రెండింటిని కలిపి సామాన్య శాస్త్రం పేరుతో ఒకే పరీక్షను నిర్వహించేవారు. దీంతో విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురై సామాన్యశాస్త్రంలో ఎక్కువ మార్కులు తెచ్చుకోలేక, ఉత్తమ జీపీఏ సాధించలేక తీవ్రంగా నష్టపోయేవారు. భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం పరీక్షలను వేర్వేరుగా నిర్వహించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎన్నో ఏండ్లుగా కోరుతున్నా విద్యాశాఖ మాత్రం పట్టించుకోలేదు. రెండు సబ్జెక్టులకు కలిపి ఒకే పరీక్షను నిర్వహించడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురై గతేడాది ఎస్సెస్సీలో ఉత్తీర్ణత శాతం కూడా గణనీయంగా తగ్గింది. దీనిని గమనించిన విద్యాశాఖ ఈ ఏడాది నుంచి ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం పరీక్షలకు వేర్వేరుగా రెండు రోజుల్లో పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్లతో(హిందీ మినహా) పరీక్ష నిర్వహించేవారు. పేపర్-1ని ఒకరోజు, పేపర్-2ను మరుసటి రోజు నిర్వహించేవారు. కానీ సైన్స్ సబ్జెక్టు విషయానికి వస్తే భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రంలకు రెండు పేపర్లను ఒకేరోజు రెండు గంటల వ్యవధిలోనే నిర్వహించేవారు. కరోనా తరువాత ప్రభుత్వం అన్ని సబ్జెక్టులకు కలిపి ఒకే పేపర్‌తో పరీక్షను నిర్వహిస్తుంది. సైన్స్ పరీక్షను ఒకే రోజున నిర్వహించడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యేవారు. కొందరు ఆందోళనతో పరీక్షలను సక్రమంగా రాసేవారు కాదు. ఫలితంగా విద్యార్థులు సైన్స్‌లో ఫెయిలయ్యేవారు. భౌతికశాస్త్రం, జీవ శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ఎంత పట్టు ఉందో తెలిసేది కాదు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం సబ్జెక్టులకు వేర్వేరుగా వేర్వేరు రోజుల్లో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది. మార్చి 26వ తేదీన భౌతిక శాస్త్రం, 28వ తేదీన జీవశాస్త్రం పరీక్షలను నిర్వహిస్తారు. ఒక్కో పేపరుకు మూడు గంటల వ్యవధి ఉండగా ఈ రెండు పరీక్షలకు మాత్రం గంటన్నర వ్యవధిని కేటాయించారు. ఒక్కో పేపరుకు 50 మార్కుల చొప్పున కేటాయించారు. ఈ మేరకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, మాడల్ స్కూళ్లు, కేజీబీవీల నుంచి ఈ ఏడాది 13074 మంది విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారు.

చదవడానికి సమయం దొరుకుతుంది..

భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం పరీక్షలను వేర్వేరుగా నిర్వహించడం చాలా సంతోషం. దీని వల్ల రెండు సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడానికి అవకాశం కలుగుతుంది. వేర్వేరు రోజుల్లో రెండు పరీక్షలను నిర్వహించడం వల్ల చదువుకోవడానికి సమయం దొరుకుతుంది.

-సింధు 10వ తరగతి విద్యార్థిని, ఆశ్రమ పాఠశాల, బొట్లవానితండా

విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది..

భౌతిక, జీవశాస్త్రం పరీక్షలను వేర్వేరుగా రెండు రోజుల్లో నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గుతుంది. గతంలో ఒకేసారి ఒకరోజులోనే పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థులకు చదువుకోవడానికి సమయం ఉండేది కాదు. తీవ్ర గందరగోళానికి గురయ్యేవారు. భౌతిక శాస్త్రం జవాబులను బయాలజీలో, బయాలజీ జవాబులను భౌతికశాస్త్రం పేపర్లో రాసేవారు. ఇప్పుడు ఆ సమస్య రాదు.

-జగదీశ్వరి, జీవశాస్త్రం టీచర్, ఆశ్రమ పాఠశాల, బొట్లవానితండా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఉద్యాన సాగుపై అవగాహన కల్పించాలి

- ఉద్యాన పంటలతో రైతులు అధిక లాభాలు పొందేలా కృషి చేయాలి
- రైతుల అవగాహన సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 24 : ఉద్యాన పంటలు సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బి.నీరజాప్రభాకర్, శాస్త్రవేత్తలు, అధికారులతో జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ ప్రాంతం అన్ని పంటల సాగుకు అనుకూలమని రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా ఎదుగాలన్నారు. ప్రభుత్వం ఉద్యానవన పంటల సాగుకై అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 13వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగవుతున్నాయన్నారు. అనంతగిరి రైతు ఉత్పత్తి సంస్థను ఏర్పాటు చేసి మామిడి పండ్లను దేశ, విదేశాలకు కూడా ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు.

పూడూరు మండలంలో పర్యటన..

పూడూరు : మండల పరిధిలోని అంగడి చిట్టెంపల్లి, పూడురు గ్రామాల్లో ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ నీరజాప్రభాకర్ సంబంధిత అధికారులతో పర్యటించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఉద్యాన పంటల సాగుకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నాయని పండ్లు, కూరగాయల సాగుతో రైతులు మంచి లాభాలు పొందాలని సూచించారు.

జిల్లాలో కూరగాయల సాగుకు కృషి చేయాలి..

విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ బి.నీరజాప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లాలో కూరగాయలు, పూలు, పండ్ల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ఆ దిశగా రైతులను అధికారులు ప్రోత్సహించాలన్నారు. యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉద్యాన సాగులో ముందుకుసాగాలన్నారు. తక్కువ వనరులతో ఎక్కువ లాభం పొందే ఉద్యాన పంటలను సాగు చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకుడు భగవాన్ , ఏఐఎం ఆర్.పి. నాయుడు, ఉపసంచాలకుడు మధుసూదన్, ఎఫ్‌పీవో డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఏఆర్ ఫామ్ ఎండీ మహ్మద్ రఫీ, ఉద్యాన శాఖ అధికారులు కమల, వైజయంతి, అర్చన, విజయ్ కుమార్, బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి గుత్తా జ్వాలా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి


నారేగూడం గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానించిన సర్పంచ్ పర్మయ్య

నవాబుపేట, జనవరి 24 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దాతాపూర్, ముబారక్‌పూర్, గుల్లగూడ, నరేగూడ గ్రామ పంచాయతీల నూతన భవనాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుజేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే యాదయ్య నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గ్రామాల్లో అనేక సౌకర్యాలను కల్పించారని, సొంత భవనం లేని పంచాయతీలకు నూతనంగా నిర్మించుకోవడానికి నిధులు కేటాయించారని తెలిపారు. మండలంలోని చించల్‌పేట, ముబారక్‌పూర్ గ్రామాల్లో మూసి వాగుపై రెండు బ్రిడ్జిలను నిర్మించి ప్రజల కష్టాలను దూరం చేశామన్నారు. గంగ్యాడలో రైతుల సౌకర్యార్థం మూడు కాలాలు పంటలు పండించుకోవడానికి మూసీపై చెక్‌డ్యామ్ నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం..

అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతనే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి పంచాయతీలో సొంత భవనం ఉందని, రైతులు తమ సమస్యలను చర్చించుకుని పరిష్కరించుకునేందుకు రైతువేదికలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనంతరం అక్నాపూర్‌లో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బాలమణి, విమల, పర్మయ్య, శ్రీనివాస్ గౌడ్, బల్వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీటీసీ పద్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌రెడ్డి, ముకుంద్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.